విజయ్ సినిమాలో శ్రుతిహాసన్

శ్రుతిహాసన్ హీరోయిన్‌గా 15ఏండ్లు పూర్తి చేసుకుంది. ఆమె కథానాయికగా నటించిన తొలి సినిమా 'లక్' విడుదలై సరిగ్గా 15 ఏండ్లయింది. స్టార్‌కిడ్‌గా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చినా.. నిలదొక్కుకోవడానికి శ్రుతిహాసన్ చేసిన శ్రమ సాధారణమైనదికాదు. ప్రస్తుతం ఆమె చేతిలో నాలుగైదు సినిమాలున్నాయి. ఇదిలావుంటే విజయ్ 'GOAT' సినిమాలో శ్రుతిహాసన్ భాగం అయ్యింది. ఇందులో మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. మరి శ్రుతిహాసన్ పాత్ర ఏంటి? అనుకుంటున్నారా! ఇందులో శ్రుతి నటించలేదు. ఈ సినిమాకోసం ఓ పాటను పాడింది. సంగీత దర్శకుడు యువన్‌శంకర్ రాజా ఆమెతో ఈ సినిమాలో ఓ పాటను పాడించారు. మరో పది రోజుల్లో ఈ పాటను విడుదల చేయనున్నట్టు చిత్ర యూనిట్ ప్రకటించింది. తండ్రి కమల్‌హాసన్ మాదిరిగానే శ్రుతిహాసన్ కూడా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఓవైపు నటిగా, మరోవైపు గాయనిగా క్షణం తీరిక లేకుండా గడుపుతున్నది శ్రుతిహాసన్. రీసెంట్‌గా దర్శకుడు లోకేష్ కనకరాజ్‌తో కలిసి కూడా ఓ పాట పాడిందామె. ఆ పాటకు మంచి స్పందన వస్తున్నది.

బాలకృష్ణతో దిల్‌రాజు సినిమా?

దాదాపు అందరు హీరోలతోనూ సినిమాలు తీసిన దిల్‌రాజుకు బాలకృష్ణతో సినిమా చేయలేదన్న లోటు ఇంకా అలాగే ఉంది. ఆ లోటును భర్తీ చేసుకునేందుకు బలంగానే ప్రయత్నాలు మొదలుపెట్టారట దిల్‌రాజు. బాలకృష్ణకోసం ఓ యువ దర్శకుడు తయారు చేసుకున్న కథ దిల్‌రాజుకు విపరీతంగా నచ్చేసిందట. దాంతో ఆ యువ దర్శకుడ్ని బాలకృష్ణ చిన్న కుమార్తె తేజశ్విని వద్దకు తీసుకెళ్లి, ఆ కథను చెప్పించారట దిల్‌రాజు. గత రెండేళ్లుగా తండ్రికి సంబంధించిన వృత్తిగత అంశాలన్నీ తేజస్విని దగ్గరుండి చూసుకుంటున్న విషయం తెలిసిందే. దిల్‌రాజుకు నచ్చినట్టే తేజస్వినికి కూడా ఆ కథ బాగా నచ్చి, 'ప్రొసీడ్' అన్నారట. త్వరలోనే బాలయ్యకు ఆ యువదర్శకుడు ఫైనల్ నేరేషన్ ఇవ్వనున్నట్టు విశ్వసనీయ సమాచారం. అయితే.. దిల్ రాజు క్యాంప్ ఆ దర్శకుడి పేరును గోప్యంగా ఉంచారని తెలుస్తున్నది. బాలయ్యకు కూడా కథ నచ్చితే 'ఎన్బీకే 110' ఇదే కావచ్చు. మరి ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు కన్ఫర్మ్ అవుతుందో చూడాలి.

వలపు జుగల్ బందీ

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీష్‌శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ వేగవంతం చేశారు. గురువారం సెకండ్ సింగిల్ 'రెప్పల్ డప్పుల్'ను విడుదల చేశారు. 'బొమ్మ సోకులో బొంబాయి జాతరే..తెలుగు, తమిళ, హిందీ..వలపు జుగల్ బందీ' అంటూ మాస్ బీట్‌తో ఈ పాట సాగింది. మిక్కీ జే మేయర్ స్వరపరచిన ఈ గీతాన్ని కాసర్ల శ్యామ్ రచించారు. అనురాగ్ కులకర్ణి, మంగ్లీ ఆలపించారు. నాయకానాయికలు రవితేజ, భాగ్యశ్రీ బోర్సే డ్యాన్స్ ఆకట్టుకుంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తనదైన శైలి కామెడీ టచ్‌తో దర్శకుడు హరీష్‌శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, రచన-దర్శకత్వం: హరీశ్‌శంకర్.

ఏ రెండు ప్రేమకథలు ఒకేలా ఉండవ్..

నారా రోహిత్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'సుందరకాండ'. ఇది ఆయన నటిస్తున్న 20వ చిత్రం కావడం విశేషం. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడు. సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్‌రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణదశలో ఉంది. నేడు నారా రోహిత్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సినిమాకు సంబంధించిన స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'No two love stories are the same' అని పోస్టర్‌పై ఉంది. ఇది వైవిధ్యమైన ప్రేమకథ అని మేకర్స్ చెబుతున్నారు. విర్తి వాఘని కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీదేవి విజయ్‌కుమార్, నరేశ్ విజయకృష్ణ. వాసుకి ఆనంద్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ప్రదీష్ ఎం.వర్మ, సంగీతం: లియోన్ జేమ్స్, నిర్మాణం: సందీప్ పిక్చర్ ప్యాలెస్.

విలువైన సమయాన్ని వృథా చేశా!

మద్యపాన వ్యసనం వల్ల తన జీవితంలో పదేళ్ల విలువైన కాలాన్ని నష్టపోయానని చెప్పారు ప్రముఖ గీత రచయిత జావేద్ అక్తర్. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మద్యపానం తాలూకు దుష్ప్రభావాల గురించి ఆయన మాట్లాడారు. 1991లో ఆల్కహాల్‌కు స్వస్తిపలికానని, అప్పటి నుంచి ఈ రోజూ వరకు ఒక్క చుక్క మద్యాన్ని ముట్టుకోలేదని చెప్పారు. 'కెరీర్ పీక్ స్టేజీలో ఉన్నప్పుడు మద్యపానం అలవాటు ఎక్కువైంది. ఆ కారణంగా మానసికంగా, శారీరకంగా ఎంతో నష్టపోయా. భావోద్వేగాలు నా ఆధీనంలో ఉండేవి కావు. ఊరికే విపరీతమైన కోపం వచ్చేది. అందుకే మానుకోవాలని గట్టి నిర్ణయం తీసుకున్నా. గత 33 ఏండ్లుగా మద్యం ముట్టుకోలేదు. మద్యపానం వల్ల దాదాపు పదేండ్ల విలువైన సమయాన్ని నష్టపోయా. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే జీవితం ఇంకా అద్భుతంగా ఉండేది. నేటి యువత కూడా మద్యపానానికి దూరంగా ఉంటే జీవితాన్ని మరింత ఆనందమయం చేసుకోవచ్చు' అని జావేద్ అక్తర్ అన్నారు.

ఇకపై ఆకాష్ జగన్నాథ్

యువ హీరో ఆకాష్ పూరి తన పేరును ఆకాష్ జగన్నాథ్‌గా మార్చుకున్నాడు. ఈ విషయాన్ని సోషల్‌మీడియా ద్వారా వెల్లడించారు. బాల నటుడిగా కెరీర్ ఆరంభించిన ఆకాష్‌పూరి.. ఆ తర్వాత హీరోగా ఆంధ్రాపోరి, మోహబూబా, రొమాంటిక్, చోర్ బజార్ చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం మంచి కంటెంట్ ఉన్న కథలపై దృష్టి పెడుతున్న ఆకాష్ జగన్నాథ్ త్వరలో తన తదుపరి చిత్రాల వివరాలను వెల్లడించనున్నారు.

అన్యాయంపై తిరగబడరాసామీ..

ఎ.ఎస్.రవికుమార్‌చౌదరి దర్శకత్వంలో రాజ్‌తరుణ్ హీరోగా రూపొందుతోన్న హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషనల్ డ్రామా 'తిరగబడరాసామీ'. మల్వి మల్హోత్రా కథానాయిక. మల్కాపురం శివకుమార్ నిర్మాత. ఆగస్ట్ 2న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా టైటిల్‌సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'తిరగబడరాసామీ..' అంటూ సాగే ఈ పాటను సుద్దాల అశోక్ తేజ రాయగా, జేబీ స్వరపరిచారు. సాయిచరణ్, లోకేశ్వర్ ఈదర, చైతు సత్సంగి ఈ పాటను ఆలపించారు. రాజ్‌తరుణ్ పాత్ర తీరుతెన్నులను ఆవిష్కరించేలా ఈ పాట సాగిందని చిత్రీకరణ చూస్తే అర్థమవుతున్నది. మన్నారా చోప్రా కీలక పాత్ర పోషిస్తున్న చిత్రంలో మకరంద్ దేశ్‌పాండే, రఘుబాబు, జాన్‌విజయ్, అంకిత ఠాకూర్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: జవహర్‌రెడ్డి, నిర్మాణం: సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా.

సమాజంలోని సమస్యకు కమర్షియల్ కోటింగ్ ఇచ్చాం

'దర్శకుడు ఆద్యంత్ హర్ష కథ ఎలాగైతే ఆకట్టుకునేలా చెప్పాడో, అంతేబాగా తెరకెక్కించాడు. సమాజంలోని ఓ ముఖ్యమైన అంశాన్ని తీసుకొని దానికి కమర్షియల్ ఎలిమెంట్స్‌ని జోడించి రూపొందించిన సినిమా ఇది. ఇదొక మంచి కంటెట్. చూసిన ప్రతి ఒక్కరికీ నచ్చుతుందని నమ్మకంతో ఉన్నాం.' అని నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల అన్నారు. వరుణ్‌సందేశ్ కథానాయకుడిగా ఆయన నిర్మించిన చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష దర్శకుడు. ఆగస్ట్2న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత మహేంద్రనాథ్ విలేకరులతో ముచ్చటించారు. 'ముందు హీరో పాత్రకు ఇద్దరు ముగ్గురు హీరోల పేర్లు అనుకున్నాం. నాకు సెట్‌కొచ్చి వెళ్లిపోయే హీరో కాకుండా, సినిమా మొత్తం సపోర్ట్‌గా నిలిచే హీరో కావాలి. అందుకే వరుణ్‌సందేశ్‌ని తీసుకున్నాం. ఈ కథకు కూడా ఆయన యాప్ట్. తను యూఎస్ నేపథ్యం ఉన్న పర్సన్. తన డైలాగ్ మాడ్యులేషన్ కూడా ఈ పాత్రకు కలిసొచ్చింది. నటీనటుల దగ్గర్నుంచీ, ఇందులో పనిచేసిన ప్రతి టెక్నీషియన్ మనసుపెట్టి పనిచేశారు. తప్పకుండా ఈ సినిమా విజయం సాధిస్తుందని నమ్మకంతో ఉన్నా' అని మహేంద్రనాథ్ పేర్కొన్నారు.

ప్రేమలోని కొత్త కోణాన్ని చూపించాం

రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ రావణ్'. వెంకటసత్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. సంగీర్తన విపిన్ కథానాయిక. ఈ సినిమాలో రాధిక శరత్‌కుమార్ కీలక పాత్రను పోషిస్తున్నారు. నేడు విడుదలకానుంది. గురువారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు మారుతి అతిథిగా హాజరయ్యారు. న్యూఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులకు కొత్త అనుభూతినందించే చిత్రమిదని హీరో రక్షిత్ అట్లూరి అన్నారు. గాఢమైన ప్రేమబంధం వయొలెంట్‌గా ఎందుకు మారిందనే అంశంతో ఈ సినిమాను తెరకెక్కించామని, లవ్‌స్టోరీస్‌లో డిఫరెంట్ కాన్సెప్ట్ ఇదని దర్శకుడు వెంకటసత్య తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

అమ్ములుగా అలరిస్తాను

'పురుషోత్తముడు' చిత్రం ద్వారా తెలుగు సినీ రంగంలోకి అరంగేట్రం చేస్తున్నది హాసినీ సుధీర్. రాజ్ తరుణ్ హీరోగా రామ్ భీమన దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా హాసినీ సుధీర్ మాట్లాడుతూ 'మాది మహారాష్ట్ర. హీరోయిన్ కావాలన్నది నా చిన్ననాటి కల. ముంబైలో మోడలింగ్ చేశాను. 'పురుషోత్తముడు' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం కావడం ఆనందంగా ఉంది. ఈ సినిమాలో నా పాత్ర పేరు అమ్ములు. అంతా అమ్ము అని పిలుస్తారు. తెలుగు సినిమాలు చూస్తూ పెరగడం వల్ల తెలుగు త్వరగా నేర్చుకోగలిగాను. తొలి సినిమాలోనే ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ వంటి సీనియర్స్‌తో కలిసి నటించడం వల్ల ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నా. ఈ సినిమా తెలుగులో బ్రేక్‌నిస్తుందన్న నమ్మకం ఉంది. భవిష్యత్తులో లవ్‌స్టోరీస్‌తో పాటు యాక్షన్ మూవీస్ చేయాలనుకుంటున్నా' అని చెప్పింది.

సామాజిక సందేశంతో..

ఏబీసీడీ ప్రొడక్షన్స్ సంస్థ రూపొందిస్తున్న చిత్రం 'గల్లీ గ్యాంగ్‌స్టార్స్'. ధర్మ దర్శకత్వం వహిస్తున్నారు. నేడు విడుదలవుతున్నది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'అనాథల బాధ్యతను సమాజం తీసుకోకపోతే ఎలాంటి దారుణాలు ఎదురవుతాయనే అంశాన్ని ఈ సినిమాలో చర్చించాం. 76 రోజుల పాటు నెల్లూరులో చిత్రీకరణ జరిపాం. చక్కటి సామాజిక సందేశంతో ఆకట్టుకుంటుంది' అన్నారు. సంజయ్ శ్రీ రాజ్, ప్రియ శ్రీనివాస్, భరత్, రితిక తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత: అరవేటి యశోవర్ధన్, సంగీతం: సత్య, శరత్ రామ్ రవి.